# 25. విచిత్రం

మొదట్లో విన్నప్పుడు అదసలు నమ్మదగ్గ విషయంగా నాకు తోచలేదు. 'నమ్మవొచ్చా?' అని విచారించే అర్హతకూడా ఆ విషయానికి ఉన్నదా అనే అనుమానం కలిగింది.

కాని ప్రతి సాయంత్రమూ నాకు వొచ్చే హెచ్చరికల్ని బట్టి అది విచారణీయాంశం గానే తోచింది. నేను నమ్మక పోవటానికే ఎక్కువ కారణాలున్నవి.

అసలు విషయం ఇది: ఎదురింటి వారి కోడలు - పక్కింటి నాగిరెడ్డితో సంబంధాన్ని ఏర్పరచుకుంది. ఆమె అందమైనది, చదువుకున్నదీను. భర్త లోకజ్ఞానం లేనివాడు- దాదాపు పిచ్చివా డనిపిస్తుంది. నెలకు ఇరవై రాత్రులు వ్యాపారం మీద పరాయిగ్రామాల్లో గడుపుతాడు. ఆమెకు భర్తవైపున డబ్బు వుంది. కాని, భర్తే లేడేమో ననిపిస్తుంది. అదంతా అలావుంచి, నన్ను మొదట్లో ఎంతో ఆకర్షించిన ఆమె- నాగిరెడ్డికి ఎలా వశమైందో నాకు అర్థం కాలేదు. నాగిరెడ్డికీ నాకూ పోలిక విషయం వొస్తే నేను అన్నివిధాలా ఎన్నుకో దగ్గవాణ్ని. వయసులో కాని, చదువులో కాని, అందంలో కాని, ఆమె నన్నే ఎన్నుకొని ఉండవలసింది. వయసు విషయమే నన్నెంతో బాధపెట్టింది. నలభై ఏళ్ళ నాగిరెడ్డికీ, పదహారేళ్ళ సుందరికీ ఎలా పొత్తు కుదిరిందో నాకు అగమ్య గోచరంగా వుంది.

నా సంగతి అలావుంచి యీ గ్రామంలోని ప్రతి యువకుడూ ఆమె కోసం ప్రయత్నించిన వాడే! ఆమె నాగిరెడ్డితో కాక - ఇంకో యువకుడితో సంబంధం

పెట్టుకున్నా నా యీ ఆశ్చర్యానికి కారణం ఉండేది కాదు. కనీసం ఆమె నొక విధంగా అభినందించే వాణ్ణి!

ఇదంతా అబద్ధమేమో ననే అనుమానాన్ని తీర్చుకుంటేనే కాని నాకు నిద్ర పట్టేట్టు లేదు. ఎంత శ్రమకైనా ఓర్చ దలిచాను. ఎందుకంటే - లోగడ యీ గ్రామంలోని యువక బృందమంతా ఆమె దగ్గర శృంగభంగాన్ని పొంది, చివరకు మా కెవరికీ చేతగాక, చేసేదికూడా ఏమీ లేక 'సుందరి సౌందర్యానికి తోడు పతివ్రత కూడాను' అనే విషయాన్ని ఏకగ్రీవంగా తీర్మానించాం. కాని ఇప్పటి పరిస్థితి ఎలా వున్నదంటే, నాగిరెడ్డి మా అందరికన్నా గొప్పవాడైనట్టు, అంతకన్నా మమ్మందర్నీ ఆమె ఒక విధంగా అవమానించినట్టు రూఢయింది. ఇక యీ పరిశోధన నా నెత్తినే పడ్డకారణం - నేనొక్కణ్నే ఆమె ఇంటికి అతి సమీపంలోని వాణ్ని కావటమే!

ఎంతో జాగ్రత్తగా నా పరిశోధనను ప్రారంభించాను. నాగిరెడ్డి వారింటికి వొస్తూ పోతూ ఉన్నంత మాత్రాన, అతన్ని ఆమెతో పాటే అనుమానించేటంత చిన్న హృదయం కాదు నాది. అలా అనుమానించవలసి వస్తే - నాకూ మరి కొందరికీ కూడా ఆ అవకాశం ఉండేది! అదీ కాక యీ సందర్భంలో ఆమె పవిత్రతకే ఎక్కువ అవకాశం వుందని యీ పరిశోధనను మొదలుపెట్టటంవల్ల, నేను సాక్ష్యాల మీద ఏ విషయాన్నీ నమ్మను. అసలు ఆమె వ్యభిచరించేందుకు ఒక్కటే కారణం కనిపిస్తుంది - ఆమెకు భర్తతో కలగని కామతృప్తి ఇంకొకడిచే కలగాలి. దానికి నాగిరెడ్డి సమర్థతను కూడా అనుమానించాల్సిందే! అతని వయస్సుగానీ, శరీర బలాఢ్యత గానీ ఆమెకు ఎంతవరకూ ఉపయోగపడుతవో నేను చెప్పలేను. ఆమె డబ్బు కోసం మాత్రం యీ పని చేస్తోందనుకోను. ఎందుకంటే ఆమెకు బోలెడు డబ్బుంది- అంతకన్నా విప్పి చెప్పాలంటే నాగిరెడ్డి పేదరైతుల్లోనే జమ!

పోతే 'అవకాశం' ఎట్లా? ఆమె ముసలిమామా, ఇద్దరు నౌకర్లూ ఆమెకు కాపలా ఉంటారు. ఐతే మాత్రమేం - ఆడది ధైర్యంచేస్తే వీరందరూ అడ్డమా? బలమైన కోర్కె ఆ అవకాశాల్ని ఏదో విధంగా సృష్టించుకో గలుగుతుంది.

ఈ పరిశోధనలో ఎంతో శ్రమ పడవలసి వొచ్చింది. అనేక రాత్రులు నిద్రమేల్కొని యీ దొంగలకోసం కాపలా కూర్చోవలసి వొచ్చింది. చివరకు నేను పట్టుకో గలిగాక యీ శ్రమంతా ఫలితానికి వొచ్చింది కదా ననే తృప్తి కలిగింది.

నేను కళ్లారా చూశానని వేరే చెప్పక్కర్లేదు. తెల్లవారుజామున రెండు - నాలుగు గంటల మధ్య జరిగే యీ తతంగం నన్ను నిజంగా ఆశ్చర్యపెట్టింది. అంతకన్న ఆమె ప్రవర్తన నా యీర్ష్యకు కారణమైంది. ఆమె చేస్తూన్న యీ పనిలోని నీచత్వం నాకు బోధపడింది. ఐతే ఇదే నాతో కానీ, లేక నా స్నేహితుల్లో ఒకరితో కానీ చేసినట్టయితే నే నింత బాధకు గురయ్యేవాణ్ని కాదేమో?

ఆనాటినుంచే ఆమె మీదవున్న గౌరవం మాయమైంది. ఆమె ఎంతో తేలికైందనీ, సులభంగా లొంగుతుందనే తక్కువ రకపు అభిప్రాయం నాలో పాతుకు పోయింది. ఆశ చిగుర్చ సాగింది. ఎంతో ధైర్యంతో మళ్ళీ నా ప్రయత్నాల్ని మొదలెట్టాను.

ఇప్పటికైనా ఆమె నాకు లొంగుతే ఆమె ప్రవర్తనలో కొంత అర్థం వుంటుంది. నేను నాగిరెడ్డితో పొందిన యీ ఓటమి తాలూకు మనోవ్యధకు కొంత శాంతి ఉండొచ్చు. కాని ఆమె నా ప్రేమను అంగీకరించే స్థితిలో లేనందుకు మరింత ఆశ్చర్యపడ్డాను.

ఒకవేళ నా ప్రవర్తన ఆమెకు అర్థం కాలేదేమోనన్న అనుమానంతో నాలాటి నాగరీకుడు ప్రవర్తించని విధంగా కూడా ప్రవర్తించాను. ఎన్నో సందర్భాల్లో ఆమె చెయ్యి పట్టుకొన్నాను; ప్రార్థించాను. బుజ్జగించాను... చివరకు నాగిరెడ్డి విషయం చాటింపు వేయిస్తానని బెదిరించాను కూడాను.

ఆమె నవ్వి ఊరుకుంది. నావల్ల తనకేమీ నష్టం రానట్టుగా, నన్ను ఏమీ తెలియని చిన్నపిల్లవాడి క్రింద లెక్క కట్టింది. చివరకు నాలో ఏరకం ఆశా మిగలకుండా ఇక ముందు ముందు ఆమె కోసం తల బద్దలుకొట్టుకోకుండా- పెంకె సమాధానం ఇచ్చింది.

మళ్ళీ నిరాశ నన్నావరించింది. యీసారి కలిగిన నిరాశ ఇప్పటికే కాకుండా, జీవితాంతం సరిపడే టంతగా వుంది. ఆమె ఆశ నాకు లేకపోతే పోయె; ఆ నాగిరెడ్డికి కూడా లేకుండా పోతే ఇంత బాధ పడే వాణ్ణి కాదు!

ఆమె మీద ఒక రకం 'కసి' ఏర్పడ్డది. ఆమె నాలాగే ఇంకో విధంగా బాధపడితేనే కాని నాకు మనశ్శాంతి వుండదు. కనీసం నా శూరత్వాన్నన్నా అర్థం చేసుకొని, నన్ను పొందనందుకు ఆమె విచారించినా చాలు. నాగిరెడ్డి మీద నేను ద్వేషపడటం చాలా అనవసరం. ఎందుకంటే అతణ్ణి నే నెన్నడూ కోరలేదు. నా దారికి అతనెప్పుడూ అడ్డం రాలేదు. ఆమె కోరి నాగిరెడ్డిని వరించినందుకు - అంతకన్న నన్ను విసర్జించినందుకు, ఆమెనే గురిగా పెట్టుకోవలసి వొచ్చింది.

నా పనిమీద నేను వున్నాను. కాస్త పరిచయం వున్న వారందరికీ ఈ సంగతి చెప్పేశాను. ఒక్కరికి చెప్తే యీ పల్లెల్లో అందరికీ చెప్పినట్టే! కనుక నా పనికూడా బహు తేలికైంది.

దీనివల్ల కలిగే మార్పుల్ని గమనిస్తూనే వున్నాను. ఆమె యీ దిగులుతో కుంగిపోవటాన్ని కళ్ళారా చూడాలని కాచుక్కూర్చున్నాను. చివరకు తనంత తానుగా నన్ను పిలిచి క్షమించమని వేడి నా పాదాల మీద పడ్డప్పుడు ... నేనేనా అంత తీసిపోయింది! ఆమెలాగే నేనూ నిరాకరించి, ఆ నిరాశలోని బాధ క్కూడా ఆమెను

గురిచెయ్యనూ? అప్పుడుకాని తెలియదు– ఇదివరకు నేనెలా బాధపడ్డానో! ఆమెను కరుణించనే కూడదు, జీవితాంతం వరకూ బాధపడనీ గాక!

ఐతే నేను ఊహించిన మార్పులేమీ జరగ లేదు. పైపెచ్చు ఇదివరకు భయపడేది. ఇప్పుడు కొంచెం బాహాటంగానే వ్యవహారాన్ని నడుపుతూ వుంది. ఇదివరకు తెలుస్తుందేమోనన్న భయంపోయి, ఇక తెలియనే తెలిసిందికదాననే ధైర్యాన్ని పొంద గలిగిందామె.

యీ పరిణామంతో నాకు తల తిరిగింది. నా గురి ఇంత ఘోరంగా తప్పిపోతుందని ఎన్నడూ అనుకోలేదు. యీ జీవితంలో ఆమెను ఏమీ చెయ్యలేని, నా అసమర్థత బైటపడ్డది: అది అంతతో ఆగినా పొయ్యేది. ఆమె ఏదైనా చెయ్యగల సమర్థురాలనే నిజంకూడా రుజూ అయింది.

అప్పుడు నేనెంతో విచారించాను. నాకు లొంగలేదనే అతి చిన్నవిషయంమీద, ఆమెకు అనవసరంగా ప్రచారం చేశాను. అందువల్ల నాకు ఏమీ రాలేదు. ఒక విధంగా అది ఆమెకు సహాయకారి కూడా అయింది. నా హృదయంలోని యీ కల్మషాన్ని గూర్చిన ఒక రకం బాధ నన్ను వేధించ సాగింది.

ఆమెను క్షమాపణ కోరుదామా అనుకున్నాను. కాని ఎంత చెడ్డా 'అహం'తో వున్న నా పురుషత్వాన్ని అగౌరవించుకోలేక పొయ్యాను. నా 'ఓటమి'ని నోటితో ఆమెకు నివేదించుకునేటంత ధైర్యం నాకు లేకపోయింది.

## 2

పది సంవత్సరాల తరువాత ఇంకో విచిత్రం జరిగింది. ఒకనాడు ఆమె నాకు కబురు పంపింది. వెళ్దామా వొద్దా అని చాలాసేపు ఆలోచించి, చివరకు ఆమె ఎందుకు పిలిపించిందో కనుక్కుందామనే కుతూహలంతో వెళ్ళాను.

వెళ్ళగానే ఆమె చిరునవ్వుతో ఆహ్వానించింది. ఆ మాటా యీ మాటా అయ్యాక, ఒక వుత్తరాన్ని నా చేతికిచ్చింది. అది మా తమ్ముడు చాలా ఏళ్ళనాడు ఆమెకు తన ప్రేమను అర్పిస్తూ రాసుకున్న అప్లికేషన్. దాదాపు మా తమ్ముడి యీడులో నేనూ ఆమెపట్ల ఇలాంటి పనులు చేశాను. ఎటు చెప్పేందుకూ నాకు తోచలేదు. పూర్వపు విషయాలన్నీ జ్ఞాపకానికి వొచ్చినవి. ఆమె నన్ను పెట్టిన బాధంతా యీ ఒక్క క్షణంలోనే భరించినట్లుగా తోచింది.

అన్నాను: -- "ఇందులో ఆశ్చర్య పడవలసిం దేమీ లేదు. నువ్వు అందగత్తెవు కావటమూ, నీ కళ్ళల్లో యువకుల్ని ఆకర్షించి ఆహ్వానించే శక్తి వుండటమూ దీనికి కారణాలు. నీ దగ్గర శృంగభంగం పొందని యువకులు యీ గ్రామంలో లేరని నీకు

తెలుసు. అంటే వాళ్ళందర్నీ రెచ్చకొట్టి నిరాకరించి- నీకోసం కొంతమంది పడి చస్తున్నారనీ, బాధపడుతున్నారనీ, ఆనందించటం నీకొక సరదా. అవే అస్త్రాల్ని మా వాడి మీద కూడా ప్రయోగించి ఉంటావ్-"

"నేనా?" అంది అమాయకంగా నవ్వుతూ.

"ఆ సంగతి నాకు తెలియదూ? నన్ను కూడా ఏడిపించిన ఆ సంఘటనల్ని నేను మరిచిపోయానా? నీ యవ్వనం తరిగేదిగా ఉండక పోవటం పెద్ద ప్రమాదంగానే వుంది."

"ఏం చెయ్యమంటారూ? యీ అందాన్ని కావాలని కోరి తెచ్చుకున్నానా? నేను అందగత్తెను కావటం మీకు ఇష్టం లేదు- ఔనా?" అంది.

"నా ఇష్టం సంగతి ఎందుకు? ఉండి మాత్రం ఏం ప్రయోజనం?"

"ఇష్టముంటే - నా వైపైనా చూడకుండా...?"

"ఎందుకూ చూడటం... చూసినప్పుడు-?"

"ఆ పాత సంగతులెందుకు లెండి-" అని కాస్త ఆగి, "రాత్రికి రాకూడదూ?" అంది.

నేను బతికే వున్నానా అనిపించింది. ఈ అప్సరస- యీ జీవితం లోనే నాకు లభ్యమౌతుందని కల్లోకూడా అనుకోలేదు. ఆమె మీది కోపమూ, ద్వేషమూ కావాలని కల్పించుకొన్న అయిష్టతా అన్నీ మాయమయినవి. చెప్పలేనంత ఉద్రేకంతో లేచి నిలబడ్డాను. నే నేమైనా తొందరపడతా నేమోనని ఆమె వారిస్తూ "ఇప్పుడు కాదు,... రాత్రికి!" అని నవ్వుతూ పమిట సర్దుకొని వెనక్కు జరిగింది.

## 3

ఆలోచించిన కొద్దీ నాకు అనుమానా లెక్కువ అయినవి. సుందరి ఇప్పుడు నన్ను కోరటంలో అర్థ మేమిటి? నాగిరెడ్డి చనిపొయ్యాక ఏర్పడ్డ ఖాళీలో సంవత్సరం గడిచి పొయ్యాక నాకు అవకాశాన్ని ఇస్తోందా? అంటే నాగిరెడ్డి లేడు కనుక నేను కావలసి వొచ్చాను. ఏ విధంగా చూసినా నాగిరెడ్డికి నేను తీసికట్టే నన్నమాట! ఒక వస్తువు విలువ ఇతర వస్తువుల విలువతో పోల్చినప్పుడే కదా తెలిసేది!

పది సంవత్సరాల క్రితం నేను యువకుణ్ణి. అప్పుడు నా అంత నేనుగా ప్రార్థిస్తే లొంగని యీమె, ఇప్పుడు తనంత తానుగా నన్ను కోరటంలో అర్థమేమిటి? మంచి కాలమంతా గడిచిపోయింది. అప్పటి నా వయస్సులో ఇప్పుడు మా తమ్ముడున్నాడు, నాగిరెడ్డి వయస్సులో నేనున్నాను. నిజానికి ఇప్పుడు ఆమె మా తమ్ముడి ప్రేమను

అంగీకరించినట్టయితే నాకీ విచిత్రాన్ని గూర్చిన ఆలోచనకు అవకాశం ఉండేదికాదు. నాలో చచ్చిపోయిం దేమోనని అనుమానించిన నా పురుషత్వాన్ని ఆమె మళ్ళీ రేకెత్తించింది. అది ఆమె యవ్వన మహత్యమే కావొచ్చు. ఆమె పూర్వం వలెనే ఉండి పోగలిగింది. కాని నేనో...?

ఆమె మీద నాకు వున్న 'కసి' యీ పది సంవత్సరాల్లోనూ తగ్గిపోయింది. అసలు 'సుందరి' అనే ఒక అందగత్తె నా కళ్ళ ఎదుట, నన్ను ఊరిస్తూ, ఏడిపిస్తూ వుందనే సంగతి మరచి పొయ్యాను. మనకు తెలియకుండానే శరీరం ఊపిరి పీల్చుకోవటమంతగా అలవాటైపోయింది యీ విషయం. కాని యీనాడు ఆమె మళ్ళీ అవన్నీ జ్ఞాపకం చేసింది.

నేను కోరినప్పుడు నాకు అందకుండా నన్ను ఏడిపించినట్టే, యీ సమయంలో ఆమెను ఆనాటి బాధకే గురిచేద్దామా అనే ఉద్దేశం నాకు కలగక పోలేదు... కాని అలా చేయటంవల్ల నన్ను అసమర్థుడిగా చూస్తుందేమోననే భయం కూడా కలిగింది.

అసలు ఆమె మనస్తత్వం ఏమిటోననే నా ప్రశ్నకు జవాబు దొరకనేలేదు. దాన్ని ఆమె చెప్పవలసిందే నేమో? అందుకనే ఆ రాత్రికి వెళ్ళేందుకే నేను నిశ్చయించుకున్నాను.

కానీ ఆ రాత్రి నేనీ మనస్తత్వ విచారణతో కాలాన్ని వృథా చెయ్య లేదు. అంతకన్న ఆమె కాలం వృథా కాకుండా చేయగలిగిందనే అనుకుంటాను. నన్ను వయస్సులో 15 సంవత్సరాల వెనక్కు నడిపించగలిగింది... ఇక నాగిరెడ్డి సంగతి చెప్పనా?

ఐనా నాకు అనుమానమే. పది రోజులపాటు పరిచయాన్ని వృద్ధిచేసుకొన్నాక, ఉద్రిక్తత కొంత తగ్గిపొయ్యాక, ఆమెను కదలేశాను.

"ఔనుగాని నాగిరెడ్డంటే నీకంత యిష్టమెందుకూ?"

"పోనిద్దురూ–"

"కాదు, చెప్పితీరాలి."

"నాకు ఇష్టమని మీకెలా తెలుసు?" అని ఎదురు ప్రశ్న వేసింది.

"ఇష్టం లేకపోతే మరి..."

"అదికాదు. నేనిలా బయటికి పోవలసిన అవసరాన్ని నాకు నేనే కల్పించుకో లేదు. అది నా భర్త కల్పించాడు. పోతే స్త్రీ పురుషుడి నుంచి కోరేది తన రహస్యాన్ని దాయగలగటం."

"ఆ విషయంలో నేను నాగిరెడ్డికన్నా తీసిపొయ్యానంటావా?"

"అంటాను. నాగిరెడ్డి ముసలివాడని ఎవ్వరూ, అతన్నిగూర్చి అనుమాన పడరు. మొగాడు నిత్య యవ్వనుడు. ఆడది తను కోరే పురుషత్వాన్ని సృష్టించుకో గలుగుతే సరిపోతుందిగా!"

ఈ విషయం ఆమె నాకు అనుభవపూర్వకంగానే తెలియపరచింది. "నాగిరెడ్డి మాత్రం రహస్యాన్ని దాయగలిగే శక్తి నాలో లేకపోయిందా?" అని అడిగాను.

"అప్పుడు మీరు యువకులు. మీకు అహం జాస్తి: స్త్రీ కన్నెత్తి చూసినంత మాత్రాన, ఆమె మీకు లోబడినట్టే- మీ పాదాల కిందికి వొచ్చినట్టే భావిస్తారు. అంతతో ఊరుకోక మీ ప్రతాపాన్ని నలుగురికీ చెప్పుకుంటారు. మీరు హాని చేద్దామన్న ఉద్దేశంతో ఆ పనిచెయ్యక పోవచ్చు; కాని మీ పైత్యపు శరీరాల తత్వమే అంత... నా విషయం మీరు గోలచేశారు కాని నాగిరెడ్డి ఎప్పుడైనా గోలచేసేందుకు ప్రయత్నించాడా? అదే నాగిరెడ్డికి మీకూ వున్న భేదం!"

నాకు విషయమంతా బోధపడ్డది.

"ఐతే నన్నిప్పుడు ఎందుకు కోరావో అర్థం కావటం లేదు-"

"ఇప్పుడు ఇంకేం గోల చేస్తారూ? యవ్వనపు మొదటి రోజులన్నీ గడిచి పొయినయ్యాయె! ఇప్పుడు మీరూ నాగిరెడ్డి తత్వంలోకి పడ్డారు. ఈ మొగాళ్ళ సంగతి నాకు తెలిసే మీ తమ్ముణ్ని దూరంగా వుంచాను!" అని నవ్వింది.

మా తమ్ముడికి మరో పదేళ్ళు ఆగటం మంచిదని సలహా ఇవ్వటం ఒక్కటే అన్నివిధాల శ్రేయస్కరంగా నాకు తోచింది.

*- డిసెంబర్, 1949*